క్లుప్తంగా

డాక్టర్ రమేష్‌కు సన్మానం


డాక్టర్ రమేష్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ రాష్ట్రస్థాయి సలహా మండలి స్టేట్ అడ్వయిజరీ కమిటీ బోర్డు మెంబర్‌గా ఎన్నికైన డాక్టర్ బి. రమేష్‌ను ఆదివారం కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రమేష్‌కమిటీ మెంబర్‌గా ఉంటూ తలసీమియా పిల్లలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడమే గాక తలసీమియా నివారణలో భాగంగా విద్యార్థులకు కాలేజి, యూనివర్సిటీలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ జి. సురేష్‌బాబు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు


సందేశమిస్తున్న వైష్ణోకృప చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జటిలమైన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయన్నారు. పిల్లలకు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్‌కు తగ్గిన వ్యవసాయ ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వ్యవసాయ ఉత్పత్తుల తాకిడి తగ్గింది. మార్కెట్‌కు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు అన్ సీజన్ ఉంటుంది. వేసవిలో బావులు, బోర్ల కింద మాత్రమే పంటలు సాగు చేస్తారు. మిగిలిన భూముల్లో పంటలు ఉండవు. ఇందువల్ల మార్కెట్‌కు ఉత్పత్తులు రావడం తగ్గింది. రాష్ట్రంలో ఉల్లి పండించేది ఉమ్మడి కర్నూలు జిల్లా మాత్రమే. ఈ సమయంలో ఎక్కడా ఉల్లి సాగులో లేదు. ఇందువల్ల మార్కెట్‌కు ఉల్లి రావడం బంద్ అయింది. అక్కడక్కడా సాగు చేస్తున్నా ధరలు లేకపోవడంతో స్థానికంగానే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వేరుశనగ, ఆముదం, వాము, మొక్కజొన్న, ఎండు మిర్చి వస్తున్నా.. తక్కువగా వస్తున్నాయి. అన్ని పంటల ఉత్పత్తులు కలిపి 1400 క్వింటాళ్ల వరకే వస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం వేరుశనగ ఒక్కటే దాదాపు 5000 క్వింటాళ్ల వరకు వచ్చేది.

నేడు ఎల్లమ్మ దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ తల్లి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నారు. హుండీ లెక్కింపు ఆదాయంలో ఆలయ కమిటీ సభ్యులందరూ, పూజారులందరూ పాల్గొననున్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కల్లూరు: వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి మొత్తం 50 క్వింటాళ్ల వేరుశనగ మంజూరైనట్లు వెల్లడించారు. తడకనపల్లె-14, ఉలిందకొండ-సచివాలయం2 (యాపర్లపాడు)-11 బస్తిపాడు-5, బొల్లవరం-5, కె.మార్కపురం-5, లక్ష్మీపురం (సచివాలయం1) -5, నాయకల్లు-5 క్వింటాళ్ల చొప్పున కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వేరుశనగ విత్తనం క్వింటా రూ.9,300 ఉండగా 40శాతం సబ్సిడీ పోను రైతులు రూ. 5,580 చెల్లించాలన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఫాస్ట్ ఎక్స్, విరుపాక్ష , ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్-2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3, సింహాద్రి
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫాస్ట్ ఎక్స్, బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, సింహాద్రి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ, ఉగ్రం, హసీనా, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3
భరత్ కాంప్లెక్స్ : ది కేరళ స్టోరీ, విరుపాక్ష, సింహాద్రి
శ్రీరామ : సింహాద్రి
రాజ్ : ఫాస్ట్ ఎక్స్
విజయ : ది కేరళ స్టోరీ

యథేచ్ఛగా దోపిడీ!

- కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అక్రమాలకు పాల్పడుతున్న కమీషన్ ఏజెంట్లు
- జరిమాన విధించినా కనిపించని మార్పు
- హద్దులేని దురాశ
- ఒకేరోజు నలుగురు రైతుల నుంచి అధికంగా రూ.17,731 కాజేసిన వైనం
- బాధితులు ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన రైతులు
- లైసెన్స్ రద్దు చేసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమీషన్ ఏజెంట్ల అక్రమాలు అన్నీ, ఇన్నీ కావు. రైతులను దగా చేయడమే లక్ష్యంగా కొంతమంది వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌లో అక్రమాలను సమూలంగా రూపుమాపాలనే లక్ష్యంతో జరిమానాలు విధిస్తున్నా కమీషన్ ఏజెంట్లలో మార్పు రావడం లేదు. ఇటీవలే కమీషన్ ఏజెంట్ ఈశ్వర్ ట్రేడర్ అధినేత అరవింద్ షేట్ లైసెన్స్ రద్దు చేశారు. ఈయన రైతులను దగా చేసిన తీరును పరిశీలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. గత ఏడాది డిసెంబరు నెలలో ఈ కమీషన్ ఏజెంటు ఇకే రోజు ముగ్గురు రైతులను మోసం చేశారు. ముగ్గురి నుంచి హమాలీ చార్జీల కింద రూ.800 అధికంగా తీసుకున్నారు. దీనిపై మార్కెట్ కమిటీకి ఫిర్యాదులు అందడంతో రూ.10 వేలు జరిమానా విధించారు. మరోసారి ఇలా రైతులను దగా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా, తీరు మారలేదు. ఈ నెల 5న ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన రైతులు మొక్కజొన్న పంటను తెచ్చారు. గ్రామీణ రైతులు అమాయకంగా కనిపించడంతో అడ్డగోలుగా దోపిడీ చేసి మార్కెట్ కమిటీకి దొరికిపోయాడు. ఒక బస్తాకు అన్‌లోడింగ్, కోత, చేటలకు సంబంధించి హమాలీ చార్జీల కింద రూ.12.81 మాత్రమే రైతుల నుంచి వసూలు చేయాలి. సదరు కమీషన్ ఏజెంట్ బస్తాకు రూ.30 ప్రకారం వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది. ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన నలుగురు రైతుల నుంచి తీసుకోవాల్సిన మొత్తంపై అదనంగా రూ. 17,731 కాజేశారు. ఖదర్‌బాషా అనే రైతు నుంచి రూ.4723, బాష అనే రైతు నుంచి రూ.2,670, రామాంజనేయులు అనే రైతు నుంచి 6,943, వెంకటరాముడు అనే రైతు నుంచి రూ.3,395 ప్రకారం అధికంగా వసూలు చేశారు. కమీషన్ ఏజెంటు చేతిలో మోసపోయామని గుర్తించిన రైతులు మార్కెట్ కమిటీకి ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి పూర్తిగా లైసెన్స్ రద్దు చేసింది. కర్నూలు మార్కెట్ యార్డులో రైతులను దగా చేసే కమీషన్ ఏజెంట్లు అనేక మంది ఉన్నారు. అయితే, దొరికితేనే దొంగ అనే చందనా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే పలువురికి జరిమానా, లైసెన్స్‌లు రద్దు

ప్రతి రైతుకు విధిగా ఈ-నామ్ తక్‌పట్టీ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికి అనేక మంది తక్‌పట్టీలు ఇవ్వడం లేదు. తెల్లకాగితాలపైనే వివరాలు రాసి ఇస్తున్నారు. కొంత మంది తక్‌పట్టీలు ఇస్తున్నా.. వెనక అక్రమాల లెక్కలు రాసి ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల ఓం లలితా ట్రేడర్స్, వాసవి కమీషన్ ఏజెంటు, రాజేష్ ట్రేడింగ్ కంపెనీ, లలితాదేవి ట్రేడర్స్, చలపతి ట్రేడర్స్, ఈశ్వర్ ట్రేడర్స్ కమీషన్ ఏజెంట్లు రైతులను దగా చేసినట్లు తేలింది. దీంతో వారికి జరిమానా విధించడంతో పాటు వారం రోజుల పాటు లైసెన్స్‌లు రద్దు చేశారు. రైతులను దగా చేసి ఎంత కాజేశారో ఆ మొత్తాన్ని రైతులకు ఇప్పించారు. ఇన్నీ చర్యలు ఉన్నా.. ఏజెంట్లలో మార్పు రాకపోవడం గమనార్హం. ఇప్పటికీ రైతులను దగా చేసి జేబులు నింపుకుంటున్న కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌లో ఉన్నట్లు ఫిర్యాదులున్నాయి. నిబంధనను సరించి హమాలీ చార్జీల కింద బస్తాకు రూ.12.81 మాత్రమే రైతు నుంచి వసూలు చేయాలి. అయితే, ఎవరికి వీలైనంత మేర వారు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఏజెంట్లు కమీషన్ కూడా ఎక్కువ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉల్లి మినహా అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులపై 2 శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉంది. ఉల్లికి 4 శాతం కమీషన్ ఉంది. ఇంతకంటే ఎక్కువ కమీషన్ తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.


కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

రైతులు అప్రమత్తంగా ఉండాలి..



కర్నూలు మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి వచ్చిన రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంటలు అమ్మిన తర్వాత నగదు తీసుకునేటప్పుడు హమాలీ చార్జీలు, కమీషన్ ఏజెంటు కమీషన్ కింద తీసుకున్న మొత్తంపై అవగాహన చేసుకోవాలి. అన్‌లోడింగ్, కోత, చేటలకు సంబంధించి రూ.12.81 మాత్రమే బస్తాకు హమాలీ చార్జీ చెల్లించాలి. ఇంతకంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా నేరమే అవుతుంది. ఇలా ఎవరైనా చేస్తే మార్కెట్ కమిటీలో ఫిర్యాదు చేయవచ్చు. –గోవిందు, సెక్రటరీ, మార్కెట్ కమిటీ కర్నూలు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న పాస్టర్ డి.జాన్ మోజస్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగినంత సమయం కేటాయించుకోవాలని పాస్టర్ డి.జాన్ మోజస్ చెప్పారు. ఆదివారం స్థానిక జయరామ్‌నగర్‌లోని హెర్మోను ప్రార్థన మందిరంలో పాస్టర సౌజన్యంతో హైదరాబాద్ సోమాజిగూడ యశోదా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, బీఎండీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ ఎం.జయంత్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నాగార్జున, కార్డియాలజిస్టు డాక్టర్ వెంకటాచలం, గైనకాలజిస్టు డాక్టర్ తేజస్విని, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ అశ్విన్, అనిల్, మేనేజర్ రమణ, క్యాంపు కో ఆర్డినేటర్ గణేష్ పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న లలితా పీఠం సభ్యులు

కర్నూలు కల్చరల్: శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కొత్త బస్టాండ్‌లో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని కొత్త బస్టాండ్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవా ట్రస్టు సభ్యులు, లలితాపీఠం సభ్యులు వైష్ణవి, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, తూర్పాటి నారాయణ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివి

కర్నూలు రూరల్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం అభివృద్ధి చెందడానికి మాజీ ప్రధాని మంత్రి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నాయకులు రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీక్యాంప్ కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ గుప్త, కోడుమూరు ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బజారన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ గవర్నర్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉగ్రవాదంతో జరిగే అనర్థాలపై వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కుల మత ప్రాంతీయ భావాలకు అతీతంగా ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, కార్యదర్శి గోవర్ధన గిరి, మంజునాథ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వా.. పింఛన్ వస్తుందా?


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- వృద్ధులతో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- 3వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ

కర్నూలు(రాజ్‌విహార్): అవ్వా.. పింఛన్ వస్తుందా? నెలనెలా ఒకటో తేదీన వలంటీరు సక్రమంగా తెచ్చి ఇస్తున్నారా? ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ బండమెట్టకు చెందిన సుభద్రమ్మను అడిగారు. ఇందుకు ఆమె స్పందిస్తూ తనకు పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారని, ఇదంతా నా మనవడు సీఎం జగన్ వల్లే జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం 3వ వార్డులో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బండిమెట్ట వీధుల్లో తిరిగి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను ఇంట వద్దకే తీసుకొచ్చి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ తమ ప్రభుత్వం పథకాలు అందజేస్తుందన్నారు. ఈ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ షాజహాన్ ఫర్వీన్, నాయకులు ఖాదర్ బాషా, ఖుద్దూర్, ముజహిద్, చాంద్ బాషా, హాజీ, అబ్దుల్లా, నజీర్ అహ్మద్, గౌసియా, శేఖర్, భీమన్న, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తుకు బాట

- వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే


అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే

కర్నూలు కల్చరల్: యువత ఉన్నత లక్ష్యాలు కలిగి భవిష్యతుకు బాటలు వేసుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే అన్నారు. తిరుపతి పినాక సొసైటీ, పీపుల్స్ ఎంపవర్‌మెంట్, హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ కమిషనర్ బి.యాదగిరి ఐఆర్ఎస్, అమీలియో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ చాపె ఆధ్వర్యంలో రెవెన్యూ కాలనీలోని రవీంద్ర పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జేకే, గ్రూప్, సివిల్స్ ప్రిపరేషన్ గైడెన్స్‌కు సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులకు ఆయన ఆదివారం హాజరయ్యారు. వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. యువత చదువుతో పాటు సంస్కారం, పట్టుదల, క్రమశిక్షణ కలిగి నిర్దేశించుకున్న లక్ష్యం కోసం నిరంతరం కష్టపడితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.రవికుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్, మాదాసి మాదారి కురువ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సుంకన్న, ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బలరాం, ఎర్రకోట మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కర్నూలులోని 7, 8 వార్డుల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకులు మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్థలం కేటాయించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భావసార క్షత్రియ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): భావసార క్షత్రియుల అన్నదాన కేంద్రానికి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఒక ఎకరా స్థలం కేటాయించాలని భావసార క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఎంబీసీ కింద గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో క్షత్రియులకు ప్రత్యేక కోటా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మృతి చెందిన సూర్యప్రకాష్

కర్నూలు సిటీ: బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో చికిత్స పొందుతూ పసుపుల గ్రామ సమీపంలోని బాలాజీ విల్లాస్‌కి చెందిన యువకుడు ఇ.సూర్యప్రకాష్ (26)మృతి చెందాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే ఈ యువకుడు కోడుమూరు రోడ్డులోని బంధువుల ఇంటి నుంచి ఈనెల 17వ తేదీ తెల్లవారుజామున నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని యజమాని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. చౌరస్తా సమీపంలోని టీవీఎస్ షోరూం దగ్గర కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఈ యువకుడు స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదుతో నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


తుంగభద్ర నదిలో లభ్యమైన మృతదేహం

కర్నూలు సిటీ: పంచలింగాల సమీపంలోని తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడికి 40 సంవత్సరాలు వయస్సు ఉండి ఫుల్ హ్యాండ్ ఎరుపు టీషర్ట్, కాకి కలర్ ప్యాంట్, నస్యం కలర్ ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై రాజు అని పచ్చబొట్టు, మెడకు ఆకుపచ్చరంగు గుడ్డతో చుట్టిన తాయత్తు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కర్నూలు పోలీసు స్టేషన్ సీఐ సెల్ నంబరు 9121101063, ఎస్ఐ సెల్ నంబరు 9177181578, పోలీసు స్టేషన్ ల్యాండ్ నంబరు 08518-220093ను సంప్రదించాలని తాలూకా పోలీసులు వెల్లడించారు.

ఇద్దరికి గాయాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. కంబదహాలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు గూడూరుకు బైక్‌పై బయలుదేరారు. అయితే మార్గమధ్యలోని జూలకల్ వద్ద వస్తుండగా ఆవు అడ్డు రావడంతో తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వివరాలు తెలియాల్సిఉంది.

‘ఉపాధి’ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కర్నూలు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పథకం పరిరక్షణ కోసం , ఆ పథకాన్ని బడ్జెట్ పెంచాలన్నారు. రెండు పూటల పని విధానాన్ని రద్దు చేసి, కూలీల బకాయిలు చెల్లించాలని కర్నూలులోని ధర్నా చౌక్ వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

ప్రతిపక్షానికి నిజంగా ఖర్మ పట్టింది


స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేస్తుంటే.. ఇదేం ఖర్మ అని ప్రతిపక్షం తిరుగుతోందని, నిజంగానే వారికి ఖర్మ పట్టిందని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి, ఎల్లో మీడియాకు ప్రజల చేతుల్లో వీరబాదుడు తప్పదన్నారు. ప్రతిపక్ష శాసన సభ్యులు సభలో ఉండి ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించాలి కానీ స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలియజేస్తే ఎలా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుత శాసనసభ సజావుగా సాగుతోందని, సభ్యులు కూడా వారి విలువలను, హద్దులను కాపాడుకోవాలన్నారు. అవినాష్‌రెడ్డి వ్యవహారం సీబీఐ చూసుకుంటుందన్నారు. లోకేష్ పాదయాత్రను ప్రజలే విశ్వసించడం లేదని, ఇక మా పార్టీ ఆ పాదయాత్ర గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అన్నింటినీ నెరవేర్చాం కాబట్టి 175 సీట్లకు 175 సీట్లు గెలుస్తామని ధీమాగా ఉన్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఏదో ఒక విమర్శలు చేయాలి కాబట్టి చేస్తున్నాయి కానీ, లేకుంటే వారికి రోజు గడవదని విమర్శించారు. గతంలో టీడీపీకి మూడుసార్లు అధికారం ఇస్తే ప్రజలకు ఏమీ చేయకుండా.. ఇప్పుడు మళ్లీ అవకాశం ఇవ్వాలని అడగటాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి ఉత్సవాలు


రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో 25 ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. గ్రామంలోని కులమతాలకు అతీతంగా ఉత్సవాలు జరుపుకోవడంతో పండుగ వాతారణం కనిపించింది. ఏ ఇంటి వద్ద చూసినా బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉత్సవాల సందర్భంగా ఎలాంటి పాణ్యం సీఐ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు బీటీ వెంకటసుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

రైతు సంబరాలు నిర్వహించడం సంతోషదాయకం

గ్రామాల్లో రైతు సంబరాలు నిర్వహించడంతో ఎంతో ఆనందదాయకమని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. చెన్నకేశవస్వామి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా గ్రామంలో రైతుల సంబరాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన అనంతరం వర్షాలు సకాలంలో కురవడంతో పాటు ప్రభుత్వం రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో రైతులు రెండు సీజన్లు పంటలను పండించుకుని ఆనందగా ఉన్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మండ్ల మమత, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.